
ఆలయ సిబ్బంది ఆకలి కేకలు

- మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా అందని వేతనాలు
- 14 నెలలుగా జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించని ఏజెన్సీ నిర్వాహకులు 7

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

గురువారం 6 ఫిబ్రవరి 2025

అసెంబ్లీ సాక్షిగా చారిత్రాత్మక నిర్ణయాలు

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్, మంత్రుల కృషి అనిర్వచనీయం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సంబరాలు





సంగారెడ్డిలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల ఆమోదంతో మిఠాయిలు తినిపిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గే నాయకత్వంలో రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ సాక్షిగా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బీసీ, ఎస్సీ వర్గాల ప్రజలకు నిర్మల స్వయంగా మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఆంజనేయులు, తోపాజి అనంత కిషన్, సీడీసీ రాంరెడ్డి, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేట అభివృద్ధి భేష్

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



సేంద్రీయ ఎరువును పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్, సీఈవోలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో అభివృద్ధి భేషుగ్గా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాబబరామ్ కొనియాడారు. బుధవారం సిద్దిపేటలోని డీఆర్‌సీసీ, స్వచ్ఛబడి, బుస్సాపూర్ డంపుయార్డులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈవో దశరథ్‌రామ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ మేరకు సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ వారికి పూలమొక్కను అందజేసి పట్టణాభివృద్ధిని వివరించారు. సిద్దిపేటలో మున్సిపల్ చెత్త సేకరణ వాహనం ఉదయాన్నే వార్డులలో ప్రతి ఇంటింటికి వెళ్తూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, హానికర చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు. తడిచెత్త ద్వారా బుస్సాపూర్ రిసోర్స్ పార్కు వద్ద బయోగ్యాస్, సేంద్రియ ఎరువు తయారీ చేసి, అట్టి ఎరువును రైతులకు తక్కువ ధరలో విక్రయించడం జరుగుతుందని, బయోగ్యాస్‌ను పట్టణంలోని హరిత, అక్షయ వంటి రెస్టారెంట్‌లకు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి వార్డు నుంచి సేకరిస్తున్న పొడి చెత్తను డీఆర్‌సీసీకి తరలించి పొడిచెత్తను పలు రకాలుగా విభజించి వాటి ద్వారా ఆదాయాన్ని చేకూరుస్తున్నామని తెలిపారు. అనంతరం పట్టణంలోని స్వచ్ఛ బడిలో సందర్శించి, స్వచ్ఛబడిలోని డిజిటల్ తరగతిగదిలో ఇంటింటి చెత్త సేకరణ చేయు విధానం, పట్టణంలోని మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి వాటిని ప్రొజెక్టర్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దీప్తినాగరాజు, ఐటీసీ సిబ్బంది ఉమాకాంత్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి

బాల్య వివాహాలు చేసుకోవద్దు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి

చిన్నకోడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేసుకోవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి రెడ్డి విద్యార్థినులకు సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదుస్సుకు ఆమె హాజరై విద్యార్థినులకు పోక్సో, బాల్య వివాహాలు, వరకట్నం, బాలల చట్టాల గురించి వివరించారు. అంతకు ముందు కళాశాలలోని పలు రిజిస్టర్, తరగతి గదులు, టాయిలెట్లు, మరుగుదొడ్లు, హాస్టల్ వంటగదిని, భోజన నాణ్యత, నిల్వ ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ స్నేహలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నులిపేద్దాం

- నులిపురుగులతో అనర్థాలు
- నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేయించాలి
- ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం

7

దుమ్ముధూళితో ఇబ్బందులు..



మార్కెట్‌యార్డులో అగ్నిమాపక కేంద్రం ఉండటంతో ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పుడు ఊక, దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నాం. కోతులు, కుక్కలు, పాములతో భయపడాల్సిన పరిస్థితులున్నాయి. ఫర్టిలైజర్ వాసనతో ఊపిరి కూడా పీల్చలేకపోతున్నాం..

\- బస్వరాజు నిఖిల్, ఫైర్‌మెన్

బాత్‌రూమ్‌లు లేక బయటకు వెళ్తున్నాం



కేంద్రంలో కనీస వసతులు లేవు. బాత్‌రూమ్‌లు లేక బయటకు వెళ్తున్నాం. యూనిఫామ్స్ మార్చుకోవాలన్నా ఇబ్బందే. అలాగే వంట చేసుకోవడానికి కిచెన్ లేదు.

\- భూక్య శ్రీనివాస్, ఫైర్ హోం గార్డు

నీరు నింపుకోవడానికీ ఇబ్బంది



వాహనంలో నీటిని నింపుకోవడానికి దూరంగా ఉన్న మున్సిపల్ బోరు వద్దకు వెళ్లాల్సి వస్తుంది. కొనుగోళ్లు జరిగినప్పుడు వాహనానికి షెడ్డు లేక బయట పెడుతున్నాం. వాహనం తొందరగా పాడయ్యే పరిస్థితులున్నాయి.

\- చేర్యాల శ్రీకాంత్, డ్రైవర్ ఆపరేటర్

నియోజకవర్గ కేంద్రం.. మూడు ఉమ్మడి జిల్లాల సరిహద్దులో ఉన్న పట్టణం.. ఈ ప్రాంతంలో ఎక్కడ ఏ విపత్తు జరిగినా సేవలందించే అగ్నిమాపక కేంద్రం అనేక సమస్యల మధ్య నెట్టుకొస్తున్నది. హుస్నాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రానికి భవనం లేక, ఫైర్ సిబ్బందికి వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ఈ కేంద్రానికి రెండు సంవత్సరాల క్రితం నిధులు మంజూరై శంకుస్థాపన జరిగినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇది ఒక్క హుస్నాబాద్‌లోనే కాకుండా సిద్దిపేట మినహాయించి జిల్లాలోని గజ్వేల్, దుబ్బాకలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది.

\- హుస్నాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)







కవర్లు కట్టుకుని వస్తువులుపెట్టుకున్న సిబ్బంది

రైతు సేవా కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం

అగ్నిమాపక కేంద్రానికి ఆవాసమేదీ?

- వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగింపు
- ఏళ్లు గడుస్తున్నా శంకుస్థాపనకే పరిమితమైన భవన నిర్మాణం
- నిధులున్నా పనులు సున్నా..
- చిన్న గదిలో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- ఆరు బయటే వాటర్ టెండర్ ..
- జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి !

2010లో అవుట్ పోస్టు కేంద్రంగా పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో రైతుసేవా కేంద్ర భవనంలో ప్రారంభించారు. ఆ తర్వాత 2022లో పూర్తి స్థాయి అగ్నిమాపక కేంద్రంగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేంద్రం నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూరుతో పాటు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని కొన్ని, హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు సేవలందిస్తున్నారు. ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇరువురు ఎల్ఎఫ్‌లు, నలుగురు ఫైర్‌మన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు, 13 మంది ఫైర్ హోంగార్డులు పని చేస్తున్నారు. ఏడాదిలో దాదాపు 70కి పైగా అగ్నిప్రమాదానికి సంబంధించిన కాల్స్ వస్తాయి.



చెట్ల కింద కూర్చున్న అగ్నిమాపక సిబ్బంది

రైతు సేవా కేంద్రంలో కొనసాగింపు

15 ఏళ్లుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రం వారు ఇచ్చిన చిన్న గదిలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వాటర్ టెండర్ వెహికిల్‌ను మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు లేనప్పుడు షెడ్ల కింద, ధాన్యం వచ్చినప్పుడు బయట పెట్టాల్సి వస్తుంది. చిన్నగదితో పాటు పక్కన కవర్లు కట్టుకుని సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 9 నుంచి మరుసటి రోజు ఉదయం 9 వరకు ఒక షిఫ్టు ఉండగా ఇందులో ఎల్ఎఫ్, డ్రైవర్ ఆపరేటర్, ఇరువురు ఫైర్‌మెన్లు, నలుగురు ఫైర్ హోంగార్డ్సు విధులు

మిగతా 8వ పేజీలో...



అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో సాగు చేసిన ఎర్రచందనం చెట్లు

మెట్ట ప్రాంతంలో ఎర్రచందనం సాగు

- నీటి సౌకర్యం లేక ఓ రైతు చొరవ
- ఎకరంలో వెయ్యి మొక్కలు
- రూ. 4 లక్షల పెట్టుబడి

అక్కన్నపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేద్దామంటే నీరు లేదు.. నాలుగు బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు ఓ రైతు తన పొలంలో ఎర్రచందనం సాగుచేశాడు. పదేళ్ల క్రితం నాటిన మొక్కలు మరో రెండేళ్లలో చేతికొస్తాయి.

అక్కన్నపేట మండలం గౌరవెల్లికి చెందిన రైతు కొమ్ముల భాస్కర్‌కు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అందులో పంటలు సాగు చేయాలని భావించగా, సాగునీరు లేకపోవడంతో నాలుగు బోర్లు వేశాడు. అయినా, చుక్కనీరు పడలేదు. తీవ్ర ఆందోళనకు గురైన రైతు తన భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలని పలువురు రైతులను సంప్రదించాడు. 2015లో అప్పటి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నర్సరీల్లో ఎర్రచందనం మొక్కలను పెంచింది. ఎర్రచందనం మొక్కలు నాటితే తక్కువ నీటితోపాటు పెట్టుబడీ తక్కువ అవుతుందని తెలుసుకున్నాడు. దీంతో తెల్లాపూర్‌లో ప్రభుత్వ నర్సరీ నుంచి రూ. 45కి ఒకటి చొప్పున మొత్తం వెయ్యి ఎర్రచందనం మొక్కలు కొనుగోలు చేసి.. తన ఎకరా భూమిలో నాటాడు. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి మొక్కలు ఎదిగే వరకు నీటిని అందించాడు. హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు మొక్కల కొమ్మలు చెరగడం వంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాడు. ఎర్రచందనం మొక్కలకు ఎలాంటి క్రిమికీటకాలూ ఆశించనందున ఎరువులు వేయాల్సిన అవసరం కూడా లేకుండాపోయింది. ఎర్ర నేల కావడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం మొక్కలు నాటి పదేళ్లు కావొస్తుండగా, నేల అనుకూలంగా లేని చోట్ల చెదలు పట్టి 110 మొక్కలు ఎండిపోయాయి. 890 మొక్కలు ఏపుగా ఎదిగాయి. అయితే, ఎర్రచందనం చెట్లు 12 ఏళ్లకు కోత కు వస్తాయి. చెట్టుకు 15 నుంచి 20 కిలోల వరకు ఎర్రచందనం వస్తుంది. ఇప్ప టి వరకు ఎర్రచందనం సాగుకు రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టిన రైతు.. మరో రెండేళ్లలో కోట్లలో ఆదాయం వస్తుందని చెబుతున్నాడు.



ఎర్రచందనం చెట్లు

అనుమతులు ఇవ్వాలి..



ఎర్రచందనం సాగు చేసిన రైతు కొమ్ముల భాస్కర్ ఇప్పుడు వాటిని సొమ్ము చేసుకోవడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయని అంటున్నాడు. ఎర్రచందనం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు కావాలని వ్యా పారులు చెబుతున్నారని, నర్సరీల్లో పెంచిన మొక్కలను సాగు చేస్తే విక్రయించుకోలేకపోతే పరిస్థితి ఏంటని అంటున్నాడు. తాను ఎర్రచందనం మొక్కలు నాటితే గ్రామంలో అందరూ ఎగతాళి చేశారని, అయినా సాగు చేశానని చెబుతున్నాడు. ప్రభుత్వం స్పందించి వ్యాపారులు ఎర్రచందనం చెట్టు కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నాడు.

దేశవ్యాప్తంగా కులగణన అమలు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట

గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి దమ్ముంటే దేశవ్యాప్తంగా కులగణన అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా బిల్లును ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మాదిరిగా బీఆర్ఎస్, బీజేపీ ఇందుకు సిద్ధమని ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. బీసీ జపం చేస్తున్న కేటీఆర్ బీసీ గణనలో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు నిర్లక్ష్యానికి గురయ్యారని తెలిపారు. దేశంలో కులాలు, మతాల పేరిట ప్రజలను విడగొట్టి లబ్ధి పొందడం బీజేపీ నైజమని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాకు తెచ్చింది శూన్యమని చెప్పారు. ప్రజలను మభ్యపెట్టిన, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూంకుంట ఆంక్షారెడ్డి, నెంటూరు కుమార్, దయ్యాల యాదగిరి, పొట్ట రాజు, జంగం రమేశ్, కొండల్ రెడ్డి, సమీర్, సుఖేందర్‌రెడ్డి, షరీఫ్, జహీర్ ఉన్నారు.



గజ్వేల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

రామరాజుపంతులు సేవలు మరువలేనివి

గజ్వేల్‌కు చెందిన దివంగత డీసీసీ ప్రచార కార్యదర్శి చాడ రామరాజుపంతులు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ఆయన నివాసంలో రామరాజుపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రామరాజు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

పనులు చేయించారు..చేతులెత్తేశారు

- ఏడాది క్రితం ఆపరేషన్ మెయింటెన్స్ పనులు
- సకాలంలో పూర్తిచేయకపోవడంతో నిధులు వెనక్కి
- అధికారుల ఒత్తిడితో అప్పులు చేసి మరీ పనులు పూర్తి చేసిన కార్యదర్శులు
- ఏడాదిగా నిధులు విడుదలవ్వక అవస్థలు
- జిల్లాలో రూ.3.36కోట్ల బకాయిలు



పద్మశాలిగడ్డలో పాడైన బోరుమోటారు స్థానంలో కొత్తమోటారు బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

దుబ్బాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వేసవి వెతలు మొదలయ్యాయి. నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. పాలకవర్గం లేదు.. పట్టించుకునేవారు లేరు.. సరిగ్గా ఏడాది క్రితం కూడా ఇవే ఇబ్బందులు.. అధికారులు కార్యదర్శుల మీద పడ్డారు. బిల్లులు ఇప్పిస్తామని, పనులు త్వరగా పూర్తవ్వాలని ఆదేశించడంతో అప్పు చేసి మరీ పనులు పూర్తిచేశారు. తీరా పనులు చేశాక బిల్లులు చెల్లించకుండా చేతులెత్తేశారు. దీంతో గ్రామ కార్యదర్శులు ఆపరేషన్ మెంటనెన్స్ కింద పనులు చేపట్టి, బిల్లుల కోసం కాళ్లరిగేలా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది.

గతేడాది ఫిబ్రవరి మొదటివారంలో గ్రామాల్లో నీటి వెతలు తీర్చడానికి, వేసవి సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. జిల్లా మొత్తం 499 గ్రామాలు ఉండగా, 377 గ్రామపంచాయతీలకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఏఅండ్ఎం) నిధుల కింద రూ.3.36కోట్లు విడుదల చేస్తూ 2024 మార్చి 16న ఉత్తర్వులు విడుదల చేశారు. 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే వాటిని రికార్డు చేయడంలో జాప్యం కావడంతో ఆ నిధులు వాటంతంట అవే రద్దయ్యాయి. నిధులు రద్దయినప్పటికీ, గ్రామాల్లో పరిస్థితిని చూసిన ప్రత్యేకాధికారి, మిషన్ భగీరథ అధికారులు కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించారు. నిధులు విడుదల చేయిస్తామని చెప్పి పనులు పూర్తిచేయించారు. దీంతో కార్యదర్శులు వేలాది రూపాయలు అప్పులు చేసి బోరుమోటార్లు, పైపులైన్లు మరమ్మతులు చేపట్టారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తిలో రూ.2లక్షల వరకు అప్పు చేసి మరీ పనులు చేయించారు. తొగుట మండలం బండారుపల్లిలోని కార్యదర్శి సుమారు రూ.లక్ష వరకు అప్పు చేశారు. రాజక్కపేట, పోతరెడ్డిపేట, గ్రామాలతోపాటు సుమారు 377 గ్రామాల్లోని కార్యదర్శుల పరిస్థితి ఇదే విధంగా మారింది. తీరా ఏడాదిగా వీటి నిధుల కోసం అధికారుల చుట్టూ తిరగడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం వేసవికాలం రావడంతో మళ్లీ తమపై భారం తప్పదమో అనే భయం కార్యదర్శులపై నెలకొన్నది. పాతబకాయిలు చెల్లించి, ప్రస్తుతం వేసవి ముందస్తు చర్యలకు ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే కదిలితేనే తాము గ్రామాల్లో మనుగడ సాధిస్తామని కార్యదర్శులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుంటే, సమస్యలు అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశం లేకపోలేదని ఆ పార్టీ నుంచి బరిలో దిగే ఆశావహుల్లో భయం నెలకొన్నది.

పడిపోయిన టమాట

- ధరలేక రైతులు విలవిల



కొండాపూర్‌లో సాగుచేసిన టమాట



ధర లేకపోవడంతో టమాట పంటను వదిలేసిన రైతు

మార్కెట్‌లో టమాటకు ధరలేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంటను తెంపడం లేదు. మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లో సుమారు 14 మంది రైతులు 14 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరానికి దాదాపు రూ.35వేల వరకు చేశారు. అయితే మార్కెట్‌లో కిలో టమాట రెండు రూపాయల నుంచి మూడు రూపాయలకే కొనుగోలు చేస్తున్నారు. కనీసం పెట్టుబడిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేదని ప్రభుత్వం టమాట రైతులను ఆదుకోవాలని కోరారు.

\- మిరుదొడ్డి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)

బీసీలకు న్యాయం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోద ముద్ర వేయడంపార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్పొరేటర్ పుష్పానగేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ సండే మార్కెట్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్వాస్యాం, ప్రభాకర్, అరుణ్‌గౌడ్, మహీన్‌గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నుంచి రక్ష

- ఎంఆర్‌ఎఫ్.. సీఎస్‌ఆర్ నిధులతో ఆధునిక హంగులతో భవనం..
- ఫోమ్‌తో మంటలార్పే ఫైరింజన్లు
- నిమిషాల్లో నీరు నిండేలా ఏర్పాటు
- సిబ్బందికి రెస్ట్‌రూం, కిచెన్ రూం


సదాశివపేటలో నిర్మించిన ఆధునిక ఫైర్ స్టేషన్ భవన సముదాయం

సదాశివపేట, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నుంచి రక్ష లభించనున్నది. సదాశివపేట పట్టణంలో శిథిలావస్థలో ఉన్న దశాబ్దాల కాలం నాటి ఫైర్ స్టేషన్ ఆవరణలో ఎంఆర్‌ఎఫ్ యాజమాన్యం తన సీఎస్‌ఆర్ నిధులతో ఆధునిక హంగులతో.. సకల సౌకర్యాలతో ఫైర్ స్టేషన్ భవన సముదాయాన్ని నిర్మిస్తోంది. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అత్యవసరంగా నిమిషాల్లో ఫైర్ ఇంజన్‌లోకి నీరు నిండేలా కొత్త ఫైర్‌స్టేషన్ భవన సముదాయంలో మోటార్లు, వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. ఫార్మా, రసాయన పరిశ్రమల్లో, పెట్రోల్ బంకుల్లో భారీ హోటల్స్, మాల్స్‌ల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అత్యంత ఎత్తుతో ఎగిసిపడే మంటలను సైతం ఫోమ్‌తో ఆర్పివేసే ఫైర్ ఇంజన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ మొత్తం రెండు ఫైర్ ఇంజన్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎంఆర్‌ఎఫ్ యాజమాన్యం నిర్మించిన కొత్త ఫైర్ స్టేషన్ భవనంలో మూడు ఫైర్ ఇంజన్లు నిలిచే సదుపాయంతోపాటు అగ్ని మాపక శాఖ అధికారులు, సిబ్బంది కోసం రెస్ట్ రూమ్‌లు, అడ్మినిస్ట్రేషన్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌లు ఇతర ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారు. ప్రాశ్చాత్య దేశాల్లోని ఫైర్‌స్టేషన్ భవనాల నమూనాలను పరిశీలించి అన్ని రకాలుగా అనుకూలమైన డిజైన్‌తో పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కన నిర్మించిన కొత్త ఫైర్ స్టేషన్ హైదరాబాద్ నగర శివారులోని సాఫ్టవేర్- కార్పొరేట్ భవనాల డిజైన్ పోలి ఉండడం గమనార్హం. సదాశివపేట కొత్త ఫైర్ స్టేషన్ సేవలు ఉమ్మడి మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల పరిధిల్లోని పట్టణాలు, గ్రామాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలకు కూడా అందుబాటులోకి రానున్నాయని అగ్ని మాపక శాఖ అధికారులు చెబుతున్నారు.



అందుబాటులో ఉన్న ఫైర్ ఇంజన్ వాహనాలు

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

మెదక్/వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పది విద్యార్థులు చక్కటి ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయుల బోధన సాగుతోందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. బుధవారం రామాయంపేటలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వెల్దుర్తి, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మానేపల్లి, మంగళపర్తి పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరిగే వార్షిక పరీక్షలు, జీవన నైపుణ్యాలపై లైఫ్ స్కిల్ ట్రైనర్ సునీతారాకేశ్ అవగాహన కల్పించారు.

నులి పురుగుల నిర్మూలనపై శిక్షణ


రేగోడులో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి

రేగోడు/చేగుంట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రేగోడ వైద్యాధికారి వికాస్ అన్నారు. బుధవారం రేగోడులో జాతీయ నులి పురుగుల నిర్మూలనపై ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 10న నులిపురుగుల మాత్రలు వేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వర్‌గౌడ్, ఎంఈవో గురునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చేగుంట ఎంపీపీ కార్యాలయంలో ప్రాథమిక వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశావర్కర్లకు నులి పురుగుల నిర్మూలనపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంఈవో నీరజ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదంటూ తూప్రాన్ మండలం ఘణపూర్ గ్రామస్థులు బుధవారం నీటి సరఫరా విభాగం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని పంచాయతీ కార్యదర్శికి వివరిస్తే, నీటి సరఫరా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. ఉదయం 11 గంటలైనా అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆకుల రవి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వేతనాల్లేక పోషణ భారం

మనోహరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం పారిశుధ్య పనులు చేస్తున్న తమకు మూడునెలల నుంచి వేతనాల్లేక కుటుంబ పోషణ భారంగా మారిందని జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ పంచాయతీ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. నిత్యం పనులు చేస్తున్న తమకు సమయానికి వేతనాలు రావడం లేదన్నారు. అధికారులు పట్టించుకోని వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు స్వామి, చంద్రయ్య, వీరేష్, కృష్ణ, యాదమ్మ, సుజాత, నర్సింహ, నర్సింహులు పాల్గొన్నారు.


కాళ్లకల్ గ్రామంలో విలేకరులతో గోడు వెల్లబోసుకుంటున్న కాళ్లకల్ పంచాయితీ కార్మికులు

డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా

- వేసవిలో సబ్‌స్టేషన్లపై భారం పడకుండా ముందస్తు చర్యలు
- ట్రాన్స్‌కో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్



ఇంజనీర్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఈ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగనున్నందున కోతల్లేని నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ట్రాన్స్‌కో సంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్ ఆదేశించారు. బుధవారం వేసవి ప్రణాళికపై పటాన్‌చెరు సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈలు, ఏఈలతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమే కాకుండా, పారిశ్రామిక వాడగా పేరుగాంచిన పటాన్‌చెరు పరిసరాలలో పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగం ఉంటుందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్లపై భారం పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో పటాన్‌చెరు ఆపరేషన్స్ డీఈ భాస్కర్‌రావు, పటాన్‌చెరు, బొల్లారం, గుమ్మడిదల, రామచంద్రాపురం ఈడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కాంగ్రెస్ ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నంగునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ యథేచ్ఛగా బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి బుధవారం నంగునూరు ఎంపీడీవో లక్ష్మప్పకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ర్యాలీగా తిరుగుతూ పార్టీ జెండాలు ఆవిష్కరణ చేస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెలికాని యాదగిరి, జంగిటి శ్రీనివాస్, బాగు శ్రీకాంత్ యాదవ్, గౌరబోయిన సంపత్ ఆవుల నాగరాజు, విక్రమ్ రెడ్డి, మ్యాక సాగర్, సమ్మి బాబు, గడ్డం శివ, నీల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పీఈటీ మృతి

- విలపించిన విద్యార్థులు ● కొమురవెల్లిలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అశోక్ (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన పీఈటీ పాశికంటి అశోక్(48) బుధవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. కొమురవెల్లి జడ్పీఎస్ఎస్ నుంచి ఆయన కొద్దిరోజుల క్రితమే దుబ్బాక మండలానికి బదిలీ అయ్యారు. స్థానికంగా పనిచేసిన కాలంలో విధినిర్వహణలో అంకితభావంతో వ్యవహరించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో విడదీయరాని అనుబంధాన్ని పెనవేసుకున్నాడు. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు విలపించారు. పాఠశాల ఆవరణలో మౌనం వహించిన అనంతరం ర్యాలీ చేపట్టారు. అనంతరం మర్రిముస్త్యాల గ్రామానికి వెళ్లి అశోక్ మృతదేహానికి నివాళులర్పించారు. వి మిస్‌యూ సార్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అశోక్ మృతిపై మాజీ జడ్పీటీసీ సిలివేరి సిద్దప్ప, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, నాయకులు తలారి కిషన్, పీడీ రఫత్ ఒమర్, రమేశ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వర్లకుంటను రెండు ప్రాంతాల్లో ఎలా చూపుతారు?



ఆర్డీవోతో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) కుంటల వాస్తవ పరిస్థితులను స్పష్టంగా వివరించకుండా రెండు ప్రాంతాల్లో ఉండొచ్చంటూ ఎలా చూపుతారంటూ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఐడీఏబొల్లారంలో హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రెవిన్యూ, నీటిపారుదలశాఖ, సర్వేశాఖ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రత్యక్ష విచారణ చేశారు. నీటిపారుదల, మున్సిపల్ శాఖలు చెబుతున్నట్లుగా గూగుల్‌లో ఒక సర్వేనంబర్‌లో వర్లకుంట ఉండగా, నివేదికలో మాత్రం మరో సర్వేనంబరు చూపడంపై ఆర్డీవో రవీందర్‌రెడ్డిను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్లకుంటను పూర్తిగా మూసివేసిన వ్యవహారంపై ప్రత్యక్ష విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఒకచోట ఉండాల్సిన వర్లకుంట మరో చోట కూడా చూపుతున్నందున దాన్ని కూడా చూసిన తరువాత హరితట్రిబ్యునల్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదల శాఖ ఏఈ ప్రసాద్, సర్వేయర్లు రామభద్రం, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టీపీవో పవన్ తదితరులు ఉన్నారు.



నులిపేద్దాం

నులిపురుగులతో అనర్థాలు

- నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేయించాలి
- 1-19 ఏళ్లలోపువారికి పంపిణీ
- ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కర్తవ్యం. అందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునందించాలి. ఆరోగ్య సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వం.. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ నులిపురుగుల(నట్టల) నివారణ దినోత్సవాన్ని(ఎన్‌డీడీ-నేషనల్ డివార్మింగ్ డే) నిర్వహిస్తున్నది. ఈ నెల 10న ఆ దినోత్సవాన్ని పురస్కరిచుకుని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నారు. ఆ రోజు ఏదేనీ కారణం చేత మాత్రలు వేయించని పిల్లలకు ఈ నెల 17న వేయించవచ్చు.

1 నుంచి 19 ఏళ్ల వారికి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నీళ్లతో తాగిస్తారు. 3 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఒక మాత్రను మింగించనున్నారు. 400 ఎం.జి. పరిమాణంలో ఆల్బెండజోల్ మాత్ర ఉండనుంది. పిల్లల్లో సాధారణంగా మూడు రకాల నులిపురుగులు కనబడే అవకాశం ఉంది. ఏలిక పాములు, నులిపురుగుల, కొంకి పురుగులు ఉండనున్నాయి. నులిపురుగుల మాత్రల పంపిణీలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య శాఖ ఆశా కార్యకర్తలను భాగస్వాములు చేయనున్నారు.

అపరిశుభ్రతతో నులిపురుగులు

అపరిశుభ్రతతో నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోర్లలో మట్టిచేరి అనారోగ్యానికి కారణమవుతారు. అలాగే శుద్ధ జలం తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడు మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగులతో అనారోగ్యం..

నులిపురుగులతో పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా నులిపురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత నియంత్రణ పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనాలను పుష్కలంగా కలుగజేస్తుంది.

మాత్రలు తప్పనిసరి వేయించాలి



పిల్లలందరికీ నులిపురుగుల ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మాత్రలను సిద్ధం చేశాం. ఈ మాత్రల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. వీటి వల్ల చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల పెరుగుతుంది. మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి. 10 న నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆయా శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తాం.

- డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే,
జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, సంగారెడ్డి

19 ఏళ్లలోపు వారి సంఖ్య..

సంగారెడ్డి	4,05,207
సిద్దిపేట	2,42,800
మెదక్	2,36,607



ధర్నా చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

సామన్యుడికి మేలు చేయని బడ్జెట్

- కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా

సంగారెడ్డి, రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరణ చేయాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మల్లేష్, నరసింహరెడ్డి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కార్మిక రైతు ప్రజా సంక్షేమం కోసం నిధులు ఇవ్వకపోవడం అన్యాయన్నారు. కార్మికులకు కనీస వేతన ప్రతిపాదన లేకుండా సంపన్నులపై పన్నులు వేయకుండా పరోక్షంగా సమాన్య ప్రజలపై భారం పడేలా బడ్జెట్ ఉందన్ని ఆరోపించారు. రైతాంగాన్నికి గిట్టుబాటు ధర, ఉపాధిహామీకి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర, జిల్లా నాయకులు జనార్దన్‌రెడ్డి, సాయిలు, ప్రసాద్, బాగారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనతో సామాజిక న్యాయం

- కాంగ్రెస్ నేత నీలంమధు

నర్సాపూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంకల్పభేరి సభకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రాజ్ఞానేశ్వర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు ముఖ్యంగా ముదిరాజులకు పెద్ద ఎత్తున అవకాశాలు లభించనున్నాయన్నారు. బీసీ కుల గణన చేయడంతో బీసీల జనాభాలలో ముదిరాజుల శాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని తేలిందన్నారు. చాలా రోజులుగా ముదిరాజులు బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే డిమాండు పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ముదిరాజుల సంక్షేమ సమితి సభ్యులు నారాయణ, నర్సింలు, సురేష్, రమేష్, మత్స్య శాఖ డైరెక్టర్లు శ్రీనివాస్, మహేష్, నాయకులు సంతోష్, ఆంజనేయులు, కృష్ణ, సందీప్, సుజాతసత్యం, మనిదీప్, రాజేందర్, కిష్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నీలం మధు

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది రైతు ఆత్మహత్య

మునిపల్లి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మున్నూరు కృష్ణ (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి ఆయన మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో వివిధ ఆసుపత్రులకు చూపించినప్పటికీ రోగం నయం కాలేదు. ఈ నేపథ్యంలో కృష్ణ భార్య ఈ నెల 3న సదాశివపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య మన్నూరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధుడి మృతి

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన కొమురవెల్లి లింగయ్య (68) అనారోగ్యంతో మంచానపడ్డాడు. రోజులాగే బీడీ వెలిగించిన అనంతరం పక్కకు పారేసి దుప్పటి కప్పుకుని నిద్రపోయాడు. ఈ క్రమంలో నిప్పురవ్వతో మంటలంటుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. కాసేపటి తరువాత గమనించిన చుట్టుపక్కలవాళ్లు 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స నిర్వహించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

చెరువులో పడి యువకుడు..



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం బండమైలారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. బుధవారం ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రావణ్‌కుమార్(23) కొంతకాలంగా ములుగు మండలం బండమైలారంలో ఉంటూ కంపెనీలలో పెయింటింగ్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన స్నేహితులతో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాకపోయేసరికి వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, బుధవారం ఉదయం గ్రామ శివారులోని రాణికుంట చెరువులో శ్రావణ్‌కుమార్ మృతదేహం కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమర్టానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ సిబ్బంది ఆకలి కేకలు

- మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా అందని వేతనాలు
- 14నెలలుగా జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించని ఏజెన్సీ నిర్వాహకులు

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి) : కమీషన్ డబ్బుల కోసం కక్కుర్తి పడ్డారో.. మరే ఇతర కారణంతో విస్మరించారో గానీ కొమురవెల్లి మల్లన్న ఆలయాధికారుల నిర్లక్ష్య వైఖరితో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడంలేదు. మల్లన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 30 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కొక్కరికి వేతనంకింద రూ.15వేల నుంచి రూ.26వేల వరకు ప్రతీ నెలా ఓ ప్రవైటు ఏజేన్సీ ద్వారా చెల్లిస్తున్నారు. దీని కోసం సుమారు రూ.6లక్షలు ఏజెన్సీకి ఆలయం నుంచి అందుతున్నది. కాగా, ఏజెన్సీ నిర్వహకులు ప్రభుత్వానికి జీఎస్టీ, సిబ్బందికి ఈఎస్ఐ, ఈపీఎఫ్ చెల్లించాల్సి ఉండగా, శఠగోపం పెడుతున్నారు. ఈ విషయాన్ని ఎప్పటి కప్పుడు పరిశీలించాల్సిన ఆలయాధికారులు పట్టించుకోకపోవడంలేదు. ఇతర దేవాలయం నుంచి కొన్ని నెలలక్రితం మల్లన్న ఆలయానికి బదిలీపై వచ్చిన ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తతంగాన్ని గమనించడంతో అసలు విషయం వెలుగు చూసింది.

సెప్టెంబరు 2023 నుండి...

ఏజెన్సీ నిర్వాహకులు సెప్టెంబరు 2023 నుంచి అక్టోబరు-2024వరకు జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించలేదు. సంబంధిత రికార్డులేవీ ఆలయాధికారులకు సమర్పించకున్నప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించారు. కానీ వారు ప్రభుత్వానికి జీఎస్టీ, ఇతర చెల్లింపులు చేయలేదు. ప్రతీ నెలా సుమారు రూ.2లక్షలు చొప్పున రూ.28లక్షలు బకాయి ఉండగా, ఇటీవల ఓ ద్వితీయశ్రేణి అధికారి ఈ తతంగాన్ని గమనించి ఏజెన్సీకి డబ్బుల చెల్లింపు నిలిపివేశారు. అయినప్పటికీ ఏజెన్సీ నిర్వహకుడు ఆయా పత్రాలు దాఖలు చేయకపోవడం, ఈవిషయమై ఆలయాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో సిబ్బందికి మూడునెలలుగా వేతనాలు అందడంలేదు. ఏజెన్సీ నిర్వాహకులు దర్జాగా మాయచేసినా గుర్తించడంలో ఆలస్యం చేసిన అధికారులు ప్రత్యామ్నాయ చర్యల్లోనూ తాత్సారం వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తం బకాయి డబ్బులు కట్టిస్తాం : ఈవో రామాంజనేయులు

ఏజెన్సీ నిర్వాహకులు జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించని విషయం గుర్తించడంతో చెల్లింపు నిలిపివేశాం. దీంతో మూడు నెలల డబ్బులు చెల్లించారు. మిగతా నెలల బకాయి డబ్బులు కూడా కట్టిస్తాం. ఇక నుంచి మేమే నేరుగా చెల్లించేలా చూస్తాం. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులుపడుతుండటాన్ని గమనించి చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం.

అన్న కొడుకే హంతకుడు

- ఆస్తి తగాదాలు, తండ్రిని చంపాడన్న కక్షతో..
- శివ్వంపేట హత్య కేసును ఛేదించిన పోలీసులు
- తూప్రాన్‌లో వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపాడన్న అనుమానం, ఆస్తి పంపకం చేయడంలేదన్న పగతో సొంత చిన్నాన్నను స్నేహితుడితో కలిసి హతమార్చాడు ఒకరు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తిక్కదేవమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధి సామ్యతండాలో ఈ నెల 1న జరిగిన ఈ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను బుధవారం రాత్రి తూప్రాన్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెంకటరెడ్డి వెల్లడించారు. మాలోతు మదన్‌లాల్‌ను సొంతం అన్న తారాసింగ్ కుమారుడు మాలోతు భరత్ సేన్ హతమార్చినట్లు వివరించారు. హత్యకు గురైన మాలోతు మదన్‌లాల్ అన్న మాలోతు తారాసింగ్ కుమారుడు భరత్‌సేన్‌కు ఆస్తి తగాదాలు ఉన్నాయి. భరత్ సేన్ తండ్రి తారాసింగ్ 2016లో ప్రమాదవశాత్తు చనిపోవడంతో దానికి కారణం మదన్‌లాల్ అని అతను అనుమానం పెంచుకున్నాడు. మదన్‌లాల్, తారాసింగ్ మధ్య ఆస్తి పంపకాలు జరగకపోగా, దీనిపై ప్రశ్నిస్తే నివ్వు మా అన్నకు పుట్టావన్న నమ్మకం ఏంటంటూ అవమానిస్తూ మాట్లాడాడు. దీన్ని మనసులో పెట్టుకున్న భరత్‌సేన్ చిన్నాన్న మదన్‌లాల్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో అతడు నార్సింగి మండలం జప్తిశివునూర్ గ్రామానికి చెందిన స్నేహితుడు మ్యాకల నవీన్(29) కారు అద్దెకు తీసుకు రమ్మని చెప్పాడు. ఈ మేరకు ఒకటవ తేదీ రాత్రి సామ్య తండాలోని మాలోతు మదన్‌లాల్ ఇంటికి ఇద్దరు వెళ్లి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. బుధవారం సాయంత్రం తూప్రాన్ శివారులో మాలోతు భరత్‌సేన్, మ్యాకల నవీన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ రంగ కృష్ణ, ఎస్ఐలు మధుకర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, శివానందంలను డీఎస్పీ అభినందించారు.

'వర్గల్ నవోదయ'కు ద్వితీయ స్థానం

వర్గల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్ జిల్లాలోని నావోగావు కేరిలో జరిగిన 26వ ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న జరిగిన ఈ పోటీల ఫలితాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ బీపీ ఆచార్య ప్రకటించారన్నారు. గుజరాత్ రాష్ట్రం వల్సాడ్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం ప్రథమ స్థానం సాధించిందన్నారు. వర్గల్ విద్యాలయ విద్యార్థులు బెన్‌హర్ పాల్, రామ్‌చరణ్, ఆదీనాథ్, అభినవ్, నక్షత్ర, వైశాలి, శ్రీమణి, వైష్ణవి ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారన్నారు. న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తారన్నారు.

కాంట్రాక్టర్‌కు కాసులు కురిపిస్తున్న రైల్వే మట్టి

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే సంస్థ సొమ్మును ఒక కాంట్రాక్టర్ తన జేబులోకి వేసుకుంటున్నాడు. ఇది కుకునూరుపల్లి మండలం లకుడారం రైల్వేస్టేషన్ వద్ద గత 15 రోజులుగా కొనసాగుతున్నది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి రైల్వేలైన్ పనులలో భాగంగా ఒక వరుస రైల్వేలైన్ సిద్దిపేట వరకు పూర్తి అయినది. లకుడారం రైల్వేస్టేషన్ వద్ద మరో రెండు లైన్లను పలు అవసరాల కోసం రెండు లైన్లను నిర్మించడానికి పనులను చేపట్టారు. దీని కోసం మట్టిని తొలగించే పనులు చకచక జరుగుతున్నాయి.

రైల్వేలైన్ నిర్మించడానికి తీస్తున్న మట్టిని కాంట్రాక్టర్ లకుడారం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు భారీ ఎత్తున అమ్ముకుంటున్నాడు. ఒక్కో టిప్పర్‌కి రూ. 1500లకు అమ్ముకుంటున్నాడు. నల్లరేగడి మట్టి కావడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు తమ పొలాలలోకి మట్టిని కొనుగోలు చేస్తున్నారు. ఇటుక బట్టీలకు కూడా సరఫరా చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు 300 ట్రిప్పుల వరకు మట్టిని తరలించినట్లు సమాచారం. మట్టిని తరలించడానికి ప్రభుత్వ వాహనాలను కూడా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వాహనాలలో తరలిస్తుండడంతో గ్రామానికి చుట్టుపక్కల రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దీనిపై కుకునూరుపల్లి ఎమ్మార్వో సుజాతను వివరణ కోరగా మట్టి తరలింపు అంశం మా దృష్టికి రాలేదని అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నల్ల మట్టిని టిప్పర్లలో లోడ్ చేస్తున్న ఎక్సవేటర్.



మోడల్‌స్కూల్‌లో హిందీ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో టీజీటీ హిందీ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బిక్షం బుధవారం ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 8వ తరగతి వరకు గంటల ప్రాతిపదికన హిందీ బోధన చేసేందుకు హిందీ పండిట్ పూర్తిచేసి టెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 7న ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

మినీ జాబ్‌మేళాలో 25మంది ఎంపిక

గజ్వేల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో వందమంది విద్యార్థులు పాల్గొనగా 25 మంది ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి వెంకటేశ్ తెలిపారు. సదాశివపేటకు చెందిన ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహించారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌తో యువతకు మేలు

● సిద్దిపేట, చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో యువ ఆవిష్కరణలపై అవగాహన సదస్సు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత ఆలోచనలు కల్గిన యువతను శక్తివంతం చేయడానికి యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం ఉపయోగపడుతుందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్ (టీఎస్‌ఐసీ), యునిసెఫ్ సంయుక్త సహకారంతో రూపొందించిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్‌ఐ) కార్యక్రమాన్ని బుధవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం, విద్యార్థులకవసరమైన జ్ఞానం, మెంటర్‌షిప్‌ను అందించడంతో పాటుగా ఇంక్యుబేషన్ మద్దతును అందిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కో ఆర్డినేటర్ డా. ఎస్ అంజని మాట్లాడుతూ కార్యక్రమం 3 దశల్లో ఉంటుందని, మొదటి దశలో విద్యార్థులు నమోదు చేసుకుని కోర్సు మాడ్యుల్స్‌ను పూర్తి చేయడంతో పాటుగా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఐడియాలు సమర్పించినవారికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. రెండోదశలో పరిశ్రమలకు పంపించి వారి ఐడియాపై పని చేయడం, మూడో దశలో ఇంటర్న్‌షిప్‌లు, రివార్డులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి గోపాల సుదర్శనం, ఆంగ్ల విభాగాధిపతి ఉమామహేశ్వరి, మహిళా సాధికారత విభాగం సమన్వయ కర్త లీలావతి, బాలకిషన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సునీత, హాజరైన విద్యార్థులు

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూనే ప్రస్తుత సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రణీత పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం నిర్వహించిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇన్నోవేషన్‌లో నూతన ఆవిష్కరణల రూపకల్పనకు పాటుపడాలని, అందుకు విద్యార్థులు గ్రూప్‌గా ఏర్పడి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● పలు విద్యాసంస్థల్లో సైబర్ జాగృక్త దివాస్

కొండపాక/ వర్గల్/ మద్దూరు/ ములుగు ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ జాగృక్త దివాస్ సందర్భంగా జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కొండపాక మండలం నాగులబండ వద్ద గల ఐటీ టవర్ ఉద్యోగులకు, కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంటికి వెళ్లాక తమ తల్లిదండ్రులకు, చుట్టుపక్కలవారికి సైతం సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీ ఉద్యోగులు, కొండపాకలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. వర్గల్ మండలం మైలారం జడ్పీ ఉన్నత పాఠశాలలో గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్‌లో గుర్తు తెలియని లింక్స్ ఓపెన్ చేయవద్దని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడినట్లయితే 24 గంటల లోపు 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మద్దూరు మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ములుగులోని గీతాంజలి పాఠశాలలో ఎస్‌ఐ విజయ్‌కుమార్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.


కొండపాక: ఐటీ టవర్ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

పూసల కులస్థులను ఆదుకోవాలి

కోహెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిరుపేద సంచార జాతికి చెందిన పూసల కులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. బుధవారం కోహెడలో పూసల కులస్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారులతో ఊరూరా యాత్రలు, వార సంతాలు తిరిగి జీవించే భూమిలేని పూసల కులస్థులకు రెండెకరాల భూమి అందించాలని కోరారు. ఉపాధి హామీలో జాబ్ కార్డులతో ముడి పెట్టకుండా భూమిలేని రైతుకూలీలకు ఇచ్చే రూ. 12 వేలు అందించాలన్నారు.

ప్లాస్టిక్ రహిత కొమురవెల్లికి పాటుపడదాం : ఎంపీడీవో

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత కొమురవెల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని కొమురవెల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌వర్మ అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలు, తడి,పొడిచెత్త, హానికర చెత్త, డ్రై డే, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపట్ల పంచాయతీ, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బందితో బుధవారం రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లు విక్రయించిన వారిపై రూ. 1లక్ష నుంచి రూ2లక్షల వరకు జరిమానా విధిస్తామన్నారు. హోటల్స్‌లో గాజు గ్లాస్, స్టీల్‌ప్లేట్లు మాత్రమే వినియోగించేలా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

బెల్ట్‌షాపులను నియంత్రించాలి: బీజేపీ

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలో ఉన్న బెల్ట్‌షాపులను నియంత్రించాలని ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డికి బీజేపీ ఆధ్వర్యంలో రెప్రెజెంటేషన్ అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బెల్ట్‌షాపులు నియంత్రణ అని చెప్పి నేటికి 13 నెలలు అయినా గ్రామాల్లో బెల్ట్‌షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వంజరి రాజు, సత్యం, స్వామి, కుమార్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చేర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌ను నిరసిస్తూ కొమురవెల్లి మండల కేంద్రంలో తెలంగాణ రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ నాయకులు బుధవారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు.

ఎస్సీలను విభజించడం సరికాదు

● మాలమహానాడు ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం


నారాయణరావుపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

సిద్దిపేట/సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించడం సరైందికాదని రాష్ట్ర మాలమహానాడు పొలిట్‌బ్యూరో సభ్యుడు ర్యాకం శ్రీరాములు, సోషల్‌మీడియా కార్యదర్శి కాల్వ నరేష్, నాయకులు స్వామి, మండల యాదగిరి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో కేంద్రప్రభుత్వ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను వేర్వేరుగా దహనం చేశారు. కార్యక్రమంలో మాలమహనాడు నాయకులు మల్లయ్య, రోశయ్య, రాజేశం, నరేష్, రాజు, యాదగిరి, స్వామి,బుచ్చయ్య తదితరులున్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో మాలమహానాడు అధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం మాల మహానాడు మండల అధ్యక్షుడు చేగురి కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును క్యాబినెట్ ఆమోదం, అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టినందుకు నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వర్గీకరణ విషయంలో వెనక్కి తగ్గకపోతే రాబోయే రోజుల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తునికి మహేష్, మాలమహనాడు ప్రతినిధులు జంగిటి కిషన్, బ్యాగారి నర్సింలు, చేగురి నర్సయ్య, మహంకాళి భిక్షపతి, బిట్ల కైలాష్, గ్రామ అధ్యక్షుడు దోటి బాలరాజు, అంబెడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు, కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పేరుతో బీసీలకు ద్రోహం


కోహెడలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

కోహెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే తప్పుల తడక అని, సర్వే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసే కుట్రకు పాల్పడుతున్నది హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం కోహెడలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు గతంలోనే సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. మమ్మల్నే కులగణన చేయమని అడుగుతారా అనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి రిపోర్టు తయారు చేసి బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. సగం ఇళ్లకు సర్వే చేసేవారు వెళ్లనే లేదని, నెల రోజులు సమయం తీసుకొని మళ్లీ సర్వే చేసి బీసీల సంఖ్యను సరిగ్గా చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పీఏసీఎస్ చైర్మన్ చేర్యాల దేవేందర్‌రావు, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

● నంగునూరు: రాష్ట్రప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ పేర్కొన్నారు. బుధవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కులగణన సర్వే రిపోర్టులో బీసీల సంఖ్యను తగ్గించడం సరైన విధానం కాదన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా పండుగ

సిద్దిపేట రూరల్/నంగునూరు/చిన్నకోడూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు బుధవారం జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు జెండాపండుగను ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు. పలువురు ముఖ్యనాయకులు స్థానిక ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సిద్దిపేట రూరల్ మండలంలోని మాచాపూర్, సీతారాంపల్లి, ఇర్కోడు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్ర యాదయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సాధ్యంకాని హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను వంచించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నంగునూరు మండలం బద్దిపడగ, దర్గపల్లి, జేపీ తండా గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు అనగొని లింగంగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తడిసిన ఉమా వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలంలోని అల్లీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి, మండల సమన్వయ కర్త పాల సాయిరాం మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.


సిద్దిపేట రూరల్: మాచాపూర్‌లో పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్ ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కోరారు. శాసనమండలిలోకి కార్పొరేట్ శక్తులు సభ్యులుగా వెళ్తే ప్రభుత్వ ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడారు. స్వతంత్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కొందరు కార్పొరేట్ శక్తుల డబ్బులతో మండలిలో అడుగుపెడదామని చూస్తున్నారని, దీనిని ఉపాధ్యాయులు అడ్డుకోవాలని ఆయన కోరారు. ఈనెల 27 న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల గొంతుకగా పనిచేస్తా


గజ్వేల్‌లో మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్

గజ్వేల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీచర్ ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుంచి రిటైర్మెంట్ వరకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేశానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అశోక్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. వారితో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాంచంద్రం, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసత్వ ఉద్యోగాలు కల్పించాలి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల వారసత్వం ఉద్యోగాలు కల్పించాలని బుధవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం వద్ద వీఆర్ఏలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్ఏల కష్టాలను గుర్తించి జీవో నెంబర్ 81, 85 ప్రకారం మొత్తం 20,555 మందికి గాను 16,758 మందికి నియామక ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. మిగిలిన 3,797 మందికి జీవో ప్రకారం వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కొత్త ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా నియామకపత్రాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకుంటే భవిష్యత్ కార్యాచరణ తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు నీరుడి శ్రీనివాస్, మ్యాకల లక్ష్మణ్, నర్సింలు, చందు, సుందర్, బిక్షపతి, ఐలయ్య, లక్ష్మీనరసయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రానికి ఆవాసమేదీ?

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. సొంత భవనం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు, విశ్రాంతి గదులు, కార్యాలయం వంటివి లేవు, మరుగుదొడ్లు లేక బయటకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. చెట్టు కిందనే వీరు సేదతీరుతున్నారు.

రెండేళ్ల క్రితం శంకుస్థాపన

అగ్నిమాపక కేంద్ర భవనానికి హుస్నాబాద్ మార్కెట్ యార్డులోని 10 గుంటల స్థలం కేటాయించి రూ. 1.25 కోట్లు మంజూరు చేసి 5.12.2022న శంకుస్థాపన చేశారు. పది గుంటల స్థలం దీనికి సరిపోదని, 30 గుంటలు కేటాయించాలని అగ్నిమాపక అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి సమీపిస్తుండటంతో భవనం నిర్మించే వరకు ఖాళీగా ఉన్న వేరే అనువైన ప్రభుత్వ భవనం కేటాయించాలని కోరుతున్నారు.


వ్యవసాయ మార్కెట్ షెడ్డు కింద వాటర్ టెండర్ వాహనం

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన నాయిని కుమారస్వామి(40) ఉపాధి నిమిత్తం తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 2న గజ్వేల్‌కు వచ్చిన కుమారస్వామి మరునాడు కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట సమీపంలో కారు చెట్టును ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి తీసుకెళ్లి, వారి సూచనమేరకు మెరుగైన చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారస్వామి బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. ఒకరికి తీవ్ర గాయాలు

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఓ ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్లకు చెందిన రామకృష్ణ(35) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాజన్న సిరిసిల్లకు వచ్చి కుటుంబంతో గడిపి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో కుకునూరుపల్లి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం రామకృష్ణ బైకును వెనక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన రామకృష్ణను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం డాక్టర్ల సూచన మేరకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురు వాహనదారులు పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావ ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.10,500 జరిమానా విధించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గడపగడపకు వెళ్లి వివరించాలని సీఎం సూచించినట్లు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. తన కుమార్తె వివాహానికి రావాలని కోరుతూ దరిపల్లి చంద్రం అత్తుఇమామ్‌తో కలిసి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమయాత్తం కావాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరించాలని సీఎం సూచించినట్లు తెలిపారు. వెంట కౌన్సిలర్ రియాజుద్దీన్, గయాజుద్దీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దరిపల్లి చంద్రం

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు: డీఈవో

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇష్టంతో చదివినట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా విద్యా శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలో శ్రేయోభిలాషి ట్రస్టు చైర్మన్ విష్ణుజగతి ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడుతూ జిల్లాలోనే ములుగు మండల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు, మర్కుక్, వర్గల్ ఎంఈవోలు ఉదయభాస్కర్‌రెడ్డి, వెంకట్‌రాములు, అనిత, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి సమర్పించేందుకు వినతిపత్రాలతో వచ్చిన సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్‌లో జరిగిన బీసీ యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజికవర్గం పట్ల అనుచితంగా మాట్లాడాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మల్లన్నపై చర్యలు చేపట్టాలన్నారు తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి జేఏసీ నాయకులు మారెడ్డి రాంలింగారెడ్డి, పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, ముత్యాల దేవేందర్ రెడ్డి, అర్చనారెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాల ఉత్పత్తితో అధిక లాభాలు పొందవచ్చు

అక్కన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ ద్వారా పాల ఉత్పత్తితో ఎక్కువ లాభాలు పొందవచ్చని లోడీ సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గిరిజన తండాలో రైతులకు ఉచితంగా గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం కోసం పాడి పరిశ్రమ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో ప్రాజెక్టు మండల కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు, రైతులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నతంగా ఎదగాలి

అక్కన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని యూనియన్ బ్యాంక్ సిద్దిపేట రీజినల్ అధికారి రాఘవ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 60 కుర్చీలు, 15 బంకర్ బెడ్స్, 30 బెడ్స్‌ను విద్యార్థినుల సౌకర్యం కోసం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్ భాస్కర్, ఎంఈవో గుగులోతు రంగా, పాఠశాల ఎస్‌వో సరిత, తదితరులు ఉన్నారు.

కేంద్రం బడ్జెట్‌తో సకల జనుల సంక్షేమం

చేర్యాల/ధూళిమిట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సకలజనుల సంక్షేమానికి దోహదపడుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు అన్నారు. బుధవారం చేర్యాల పట్టణంలో ప్రధాని మోడీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నె సత్యవర్ధన్, బూరుగు సురేశ్, కాశెట్టి పాండు, నర్ర మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ధూళిమిట్ట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొడం యాదగిరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. .కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలకు, చిన్న ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చేర్యాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ బుధవారం చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అంగడిబజారు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపారు. కొమురవెల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం జరిపారు.